
# చీకటి నీడలు



పిఎస్ నారాయణ

రామంకు గంటక్రితం విజయవాడనుంచి టెలిగ్రాం వచ్చింది....వాళ్ళన్నయ్యకు సీరియస్‌గా వున్నదట - అందర్నీ రమ్మనమంటూ...రామం మధ్యాహ్నమే వచ్చాడు ఆఫీసు పనిమీద ఊళ్ళు తిరిగి...బాగా అలసిపోయి వున్నాడు.... అందునా అందరూ బయల్దేరాలంటే డబ్బుగూడ చూచుకోవాలిగదా .... నీవేమీ అనుకోకపోతే కాస్త ఓపిక చేసుకొని వాళ్ళమ్మను తీసుకువెళ్లి విజయవాడలో దింపిరావాలి....రానూ పోనూ చార్జీలు ఇస్తాడు....నేనే వెళ్ళేవాడినిగాని మా అమ్మాయి అలివేలుకి నిండా నెలలు....యే క్షణాన ఆస్పత్రికి తీసుకువెళ్ళవల్సి వస్తుందా అని ఎదురుచూస్తున్నాం....ప్రయాణం చేయాలన్నా నా మనస్సు మనస్సులో వుండదు. .. నీకు శెలవున్నది గదా....రేపు శనివారం. . ఎల్లుండి ఆదివారం... రేపురాత్రికి తిరిగివచ్చేసి ఆదివారం రెస్టుతీసుకోవచ్చు... ఏమంటావ్.... ఎలాగో అలాగు కష్టపడాలిరా సత్యం!" నా మిత్రుడు చలపతి నేను సాయంత్రం ఆఫీసు నుండి వచ్చేటప్పటికి నా గదిదగ్గర కాపలా కాస్తున్నాడు.

ఆ మాత్రం తోటిమనిషికి సాయం చేయటంలో తప్పేమున్నది? అందునా అతగాడు చార్జీలు యిస్తున్నాడు. కాదంటే ఒకరోజు క్యాజువల్‌లీవ్ పోతుంది—జానేదో!

"ఓకే!" అన్నాను.

"థాంక్యూ!" అంటూలేచాడు. "నేను బస్ స్టాండుకువెళ్ళి రెండు టిక్కెట్లు రిజర్వుచేసి యింటికి వస్తాను . .నీవు ఓ గంటాగి బయల్దేరి మా యింటికి వచ్చేసేయ్....నీ భోజనం యీ పూటకు మా యింట్లోచేసి వెళ్దువుగాని....మళ్ళీ ఇప్పుడు హోటల్‌కు ఏం వెళతావుగాని!"

"సరే!"

చలపతి వెళ్ళిపోయాడు.

రామం చలపతి ఒక యింట్లో పక్క-పక్క-భాగాలల్లో వుంటున్నారు అద్దెకు. చలపతి ద్వారానే రామం నాకు తెలుసు.........చొరవగా యింట్లోకి వెళ్ళిపోయేటంత పరిచయం లేకపోయినా....చలపతి ఇంట్లోనే కూర్చొని కబుర్లు చెప్పుకునే పరిచయి మున్నది.

రామంతో పరిచయమున్నా లేకపోయినా ఇది చలపతి—నా మిత్రుడు కోరిన కోరిక....కాదనలేకపోయాను.

స్నానంచేసి గుడ్డలు వేసుకొని—బ్రీఫ్ కేస్‌లో ఓ జత గుడ్డలు ఎందుకైనా పనికొస్తుందని పడేసుకొని—ఆ పైన ఓ పాతిక రూపాయలు జేబులో పెట్టుకొని గదికి తాళంవేసి బయల్దేరాను.

నన్ను చూస్తూనే రా మ ం, "చాలా థాంక్సండీ!" అన్నాడు.

"దట్సాల్‌రయిట్. ఫరవాలేదండి!" మొఖమాటంగా నవ్వాను.

చలపతి ఇంట్లో భోజనంచేసి రాత్రి తొమ్మిది గంటలప్పుడు వాళ్ళింటి దగ్గర స్టాపులో సిటీ బస్సు ఎక్కి- బస్సు డిపో దగ్గర సరిగ్గా తొమ్మిది ముప్పావుకు దిగాం బస్సు రాత్రి పదిగంటలకు.

రామం తల్లికి అరవై యేళ్ళుంటాయి....మనిషి కాయపారు మనిషి. దృఢంగా వుంటుంది....రామం చిన్నపుడే భర్తపోగా యిద్దరు కొడుకుల్నీ........యిద్దరి కూతుళ్ళనీ పెద్దచేసి....పెళ్ళిళ్ళుచేసి.........వాళ్ళకు వాళ్ళ సంసారాలు ఏర్పరిచి....కొడుకుల దగ్గర....కొన్నాళ్ళు అక్కడ—కొన్నాళ్ళు ఇక్కడా—తన జీవితాన్ని వెళ్ళబుచ్చేస్తోంది.

బస్సు పదీ పదికి గాని బయల్దేరలేదు.

ఆడవాళ్ళ సీట్లు ఖాళీగా వుండడంతో ఆమెకు ముందు వరసలో దొరికింది—నాకు చివరి సీటు—ఆలశ్యంగా టిక్కెట్లకు వెళితే ఎప్పుడూ అంతే!

బస్సు హైద్రాబాద్ దాటి స్పీడందుకుంటే గాని వెనుక సీట్లోవున్న మజా ఏమిటీ అర్థం కాలేదు .... తెల్లవారుఝామున విజయవాడ జేరేటప్పటికి ఏ పార్టుకు,ఆ పార్టు ఊడిపోయినా ఊడిపోవచ్చు .... నార్కెట్టుపల్లిలో ఎవడైనా ముందు సీటు వాడు దిగితే బాగుండు.

అనీజీగా వెనక కూర్చున్న నాకు అనుకోకుండా విజయవాడలో వున్న మా మేనత్త కూతురు శారద గుర్తుకు వచ్చింది.

మొన్న కరుణ పెళ్ళిలో కనబడి వాళ్ళింటికి ఎప్పుడూ రానందుకు నిష్ఠూరాలుగూడా వేసింది.

అత్తయ్య ఒక్కసారి కాదన్న తరువాత శారద వెంటబడి తిరగటం నాకే మనస్కరించలేదు. . దానికీ నాకు ఆరునెలలే తేడా... ....వాళ్ళకూ మాకూవున్న అంతస్థుల తేడాను—వయస్సుల తేడాతో క్యాష్ చేసుకున్నదామె!

దానికి పెళ్ళయిన మూడేళ్ళకే యిద్దరు పిల్లలు....పెళ్ళిలో నెలల పసివాడిని వళ్ళో వేసుకొని ఆపసోపాలు పడుతుంటే నాకు నవ్వు వచ్చింది — జాలివేసింది .... పాతికేళ్ళు రాకముందే—జీవితాన్ని అనుభవించాల్సింది పోయి—జీవితంలో మెడవరకూ కూరుకుపోయింది అటూ యిటూ కదలలేకుండా....

చిదిమి దీపం పెట్టుకునే అందం శారదది. నా అదృష్టమే బాగున్నట్లయితే అది నా కంటే ఇంకో సంవత్సరం ముందుగా పుట్టి నాకు భార్య అయివుండేది....మా అత్తయ్య ఇంకేం కారణాలు సృష్టించకుండా వున్నట్లయితే!

దాని పెళ్ళి రేపనగా ఒంటరిగా పెరట్లో దొరికింది.



"నా అదృష్టం ఇంతే సత్యం!" అన్నది—కళ్ళల్లో నీరు గిర్రున తిరుగుతుండగా.

"ఏమైంది నీ అదృష్టానికి!" మనస్సులో బాధగానేవున్నా—గుండె నదిమి పెట్టుకొని అన్నాను.

పెదిమ చివరలు కొరుక్కుంటూ నా కళ్ళల్లోకి చూచింది. "నీకు బాధగా లేదా, సత్యం!"

"నువ్వు నాదానివి కాలేవు అని తెలిసిన తరువాత గడిపిన ఈనెల రోజులు—నన్ను ఈ బాధకు అతీతుణ్ణి చేసినయి....... ఇప్పుడు గుండె బండబారి పోయింది!" అన్నాను బరువుగా.

అన్నీ వడ్డించిన విస్తరి ముందు ఆకలి వేడితో కూర్చున్న నన్ను ఎవ్వరో బలవంతాన చేయిపట్టుకు లాక్కువెళ్ళి విసిరేసినట్లనిపిస్తోంది—ఛీ! ఏం జన్మ!....

"....కానీ, నేను ఆడదాన్ని........అంత తొందరగా దేనినీ మర్చిపోలేను!... " అంటూ గబుక్కున లోపలకు వెళ్ళిపోయింది.

కోప మొచ్చిందేమో ననిపించిందిగాని తరువాత తరువాత మామూలుగానే మాట్లాడటంతో నన్ను నేను అనునయించుకున్నాను.

వెన్నెల్లో వేడి....సూర్యునిలో చల్లదనం, శరీరంలో కోరికలు—అన్నీ ఊహలుగానే మిగిలిపోయినయి నా జీవితంలో.

తెల్లవారుతూనే శారదను చూడగానే - ఆమె ఒళ్ళో తలపెట్టుకొని కబుర్లు చెప్పే అవకాశం నా జీవితానికి లేకపోవచ్చుగాని——ఆమెను చూస్తూ కొన్ని గంటలైనా గడిపే అధికారం నాకు ఎవ్వరూ తీసేయలేరు గదా—నాకు అదే తృప్తి!

ఆ బస్సు అంతగా ఎత్తిపడేస్తున్నా ఎప్పుడు కునుకు పట్టిందో తెలియదు——పక్కన కూర్చున్న లావుపాటి ఆయన ఒకటి రెండు సార్లు డొక్కల్లో మోచేత్తో పొడిస్తే—సరిగ్గా కళ్ళు తెరుచుకు కూర్చోక తప్పలేదు.

నార్కెటుపల్లి వచ్చిందిగాని ఎవ్వరూ అక్కడితో దిగేటట్లులేరు.

రామం తల్లి దగ్గరకువెళ్ళి, "ఏమైనా కావాలా అండీ!" అని అడిగాను.

"వద్దు నాయనా........నువ్వు టెలిగ్రాం చూచావా!"అన్నది ఆదుర్దాగా, "ఎలా వున్నాడో పెద్దాడు!"

"నేను చూడలేదండీ....రామంగారు చెప్పలేదా ఏమని ఇచ్చారో టెలిగ్రాం!"

"ఎక్కువగా వున్నది....అందరినీ బయల్దేరమని వున్నదన్నాడు....ఎక్కువగా వుంటేనే అందర్నీ ఎందుకు బయల్దేరమంటారు నాయనా ... ఏమయ్యాడో ఏమో. ..అసలే అర్భాన్నపు బ్రతుకు వాడిది!" ఆమెకు కళ్ళ వెంట నీరు

గిర్రున తిరుగుతున్నయి.

"అనారోగ్యం ఏమిటి?"

"ఏం చెప్పమంటావు—డబ్బు ఖర్చుకాందే రోగాలు తగ్గుతయ్యా నాయినా...మందులు కావాలంటే డబ్బులు కావాలి..డబ్బులులేని వాడికి రోగాలే మిగులుతయి. మొదట్లో తింటే తగ్గుతుంది.. నెత్తిమీది కొచ్చిం తరువాత మందులు తినాలనుకున్నా ఉన్న డబ్బులు ఏ మూలకి—అదీ వాడి స్థితి!"

నాకు జాలేసింది—భారత దేశంలో డబ్బులు లేక రోగాల్ని దాచిపెట్టుక్కునే మనుష్యులు చాలామంది వున్నారు—అందులో అతగాడు ఒకడు!

"ఏం చేస్తుంటారు మీ పెద్దబ్బాయి!"

"కొట్లో గుమాస్తా...అయితే నువ్వు బెల్గ్రాం చూడలేదంటావా!"

"లేదండీ!....మీరు అనవసరంగా ఆదుర్దా పడవద్దు....మరీ అంత ఎక్కువగా వున్నదీ అనుకుంటే రామంగారు రారా!"

ఆమె ఏదో అనబోయిందిగానీ— బస్సులోకి డ్రైవరు ఎక్కి గంట 'టకటక' మంటూ కొట్ట సాగాడు—ఒక్కసారిగా క్రింద నిల్చున్న జనమంతా తోసుకుంటూ ఎక్కడంతో నేను నా సీట్లోకి వెళ్ళక తప్పలేదు!

సీట్లో కూర్చుంటే శారద మళ్ళా కళ్ళ ముందు కదిలింది.

రేపు నేను వెళ్ళేటప్పటికి శారద భర్త ఊళ్లో లేకుండా వుంటే ఎంత బాగుంటుంది?- శారద నా బ్రతుకులో భాగస్వామి కాకపోవటంతో నేను పడుతున్న వేదననంతా ఆమె ముందు వెళ్ళగ్రక్కుకోవచ్చు.

—ఇప్పుడు శారద ఇదివరకటిలా చిన్న పిల్లగాదు..యిద్దరు పిల్లల తల్లి—అంత స్వతంత్రంగా మాట్లాడ గలుగుతుందా?—

గుండెల్లో గీసుకున్న బొమ్మమీద—ఎన్ని కాగితపు బొమ్మలంటించినా అసలు రూపు మాసిపోతుందా?....ఉఁహూఁ... నేను శారదను ఎలా మరువలేనో శారదా నన్ను అలాగే మరువలేదు!

దాని సంగతి నాకు తెలుసు....పెళ్ళి కొన్ని


శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్సుస్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద; ఫోన్: 551, తెనాలి (ఎ. పి.)

బ్రాంచి: 26, నార్తుబోగ్ రోడ్, మద్రాసు-17.



దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోసుతో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నములు, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు, హెర్నియా (గిలక), పోస్టుద్వారా కూడా వైద్యం చేయబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం దగ్గులకు ఉచిత వైద్యం -రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్ర వ్యాధులు, ఆపరేషన్ లేకుండా బాగుచేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

బ్రాంచీలు:-తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరవబడును.

గంటల్లో అవ్వబోతాన్నదనగా దాని కళ్ళల్లో తిరిగిన నీరు . .దానిలోని బాధ ...దాని గుండె ల్లోని వేదన నేను మరువలేను....

సగం శారదమీద ఆలోచనలు, సగం నిద్ర, ఇవిగాక నన్ను ఎగరేసి పడేస్తున్న· సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సు....జబ్బుతో చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్న అన్నయ్యను చూడ లేని తమ్ముని ఆర్థిక దుస్థితి. కొడుకు బ్రతుకు దిగులుతో కుళ్లిపోతున్న అరవైయేళ్ళ ముసలి తల్లి—ఈ ఆలోచనల నడుమనుండి కోలు కున్నది—నేను తెల్లవారుఝామున నాలుగు గంటల తరువాత—అదైనా కృష్ణ నీటి చల్లని గాలి నన్ను చుట్టివేసి ఉక్కిరి బిక్కిరిచేస్తేనే.

విజయవాడ వచ్చింది.

నేను శారద దగ్గరకు వచ్చేశాను.

ముసలమ్మను తీసుకువెళ్ళి వాళ్ళింటి దగ్గర దిగవిడిచి—ఒక్కసారి ఆ జబ్బు మనిషిని మర్యాదకు పరామర్శించి—రామంగారు త్వర లోనే వస్తారని ధైర్యం చెప్పి—కృష్ణలంకకు వెళ్ళిపోతే....

ఇంత చీకటితో నన్ను చూచిన శారద కళ్ళల్లో వెలుగు చూటటానికి తెల్లవారుతుందో లేదో?

ఎన్నాళ్ళబట్టో నా కలల్లో తిరుగుతున్న శార దను ఈనాడు చూడబోతున్నాను.

'థాంక్యూ! రామం!'

ఇరుకు సందులు దాటి బస్సు స్టాండులోకి వచ్చి ఆగింది బస్సు.

చివరవున్న నాకు దిగేటందుకు పది నిము షాలు పట్టింది.

"మీకు ఇల్లు తెలుసుగదా!" ఆమెను అడి గాను నేను.

"కృష్ణ లంకలో....!"

'ఇంకేం! కాగల కార్యం గంధర్వులే తీరు స్తారు అన్నట్లు నేను వెళ్ళాలనుకున్న చోటికే ఆమె వెళ్ళాలన్నది—దేవుడికి థాంక్స్ చెప్పు కోవాలి!'

ఒళ్ళంతా నొప్పులుగా—చికాగ్గావున్నా— శారదను చూడబోతున్నాననే ఆనందంలో అవన్నీ అంతగా పట్టించుకోలేదు.

"రిక్షాలు మాట్లాడ మంటారా?

"అలాగే నాయనా మాట్లాడు! ఎలా వున్నాడో ఏమో వాడు. ప్రాణాలతో చూస్తా నంటావా? బ్రతికుంటే చాలు నా ప్రాణాలిచ్చ యినా బ్రతికించుకుంటాను!"

"మీరేం గాభరా పడబోకండి మామ్మ గారూ! నేను చెబుతున్నా గదా. అంతా మంచే జరుగుతుంది. మీ పెద్దబ్బాయి మిమ్మల్నంద రినీ చూడాలనుకున్నాడేమో టెలిగ్రాం యిచ్చారు. లేకపోతే రామంగారు ఆగిపోతారా!''

"టెలిగ్రాం చూడలేదంటివి గదా నాయనా!''

—నా కనిపించింది—ఊరి పొలిమేర్లలో కొచ్చిం తరువాత పెళ్ళాం బిడ్డలు ఎలా వున్నారా అని అమోరించినట్లున్నదని— విజయవాడలో కాలుపెట్టి పది నిముషాల్లో కొడుకును చూడబోతున్న ఆమె—ఇంకా టెలిగ్రాంలో ఏమున్నదోనని భయంతో ఆలో చిస్తున్నదంటే—ఆమె ఎంత చాదస్తురాలో అర్థమవుతోంది!

అడ్డంవస్తున్న మనుష్యులను తప్పుకొని రెండడుగులు వేశానోలేదో—శారద!

నాకళ్ళను నేను నమ్మలేకపోయాను.

ఎదురుగా—చంకలో పిల్లవాడితో శారద నిల్చునివుంటే 'కాదూ' అని ఎలా అనుకునేది.

'ఇంత తెల్లవారుఝామున ప్రయాణంఎక్క డకు పెట్టుకున్నదో!'—నా ఉత్సాహమంతా— ఆమె కనబడిందనే సంతోషంకూడా లేకుండా జావలా కారిపోయింది.

"శారదా!"

కళ్లు పెద్దవిచేసుకుని—మనుష్యుల్ని దాటు కుంటూ వస్తున్న నా వంకచూసి, "నువ్వా సత్యం! ఇప్పుడెక్కడ నుంచిరాక, గుంటూరా" అన్నది.

'లేదు! నీ కోసరమే వస్తున్నా!' నని చెప్పా లనిపించింది నాకు.

"చిన్నపనిమీద వచ్చాను ఇక్కడికి.... ఏ(విటి పొద్దున్నే బస్సుస్టాండు కొచ్చారు.... ఎక్కడికయినా ప్రయాణమా?" నీరసంగా అడి గాను—

"అవును సత్యం! నాగార్జునసాగర్ పిక్నిక్‌కు వెళుతున్నాం .... ఎన్నాళ్ళబట్టో వెళ్ళాలని.... వీలుబడితేనా ...ఆయన ఒకటేపోరు 'శారూ పోదాం...........అని'. .. ఇదిగో వుండు పిలుస్తానుండు .... క్యూలో టిక్కెట్లకోసరం నిల్చున్నట్లున్నారు .... అవునూ నాల్రోజులుంటావా ఈవూళ్ళో. రేపుసాయంత్రానికల్లా వచ్చేస్తాము....వుండగూడదూ .. చాలా రోజులు అయింది నీతో కబుర్లుచెబుతూ కూర్చుని ... ఉంటే ఉండు. ఎంత పొద్దుపోయినా రేపు రాత్రికే వచ్చేస్తాం. ఇంకా పెళ్ళిచేసుకోలేదేం? చేసుకోవాలనుకోవటం లేదా? లేకపోతే యెవర్నయినా ప్రేమిస్తున్నావా? పెళ్ళి చేసుకొని పెళ్ళాన్ని తీసుకునివస్తే సరదాగా రెండురోజులుండి వెళ్ళచ్చు. ఇంతకీ మీవాళ్ళు నీకు సంబంధాలు చూస్తున్నారా లేదా? లేకపోతే నన్నే చూడమంటావా ఏమిటి. మాట మాత్రం మా ఆయన చెవిన వేశానంటే—ఓ నెల్రోజులు సెలవుపెట్టి నీకు పెళ్ళిచేసిగాని వదల్రు. చెప్పు, కట్నం ఎంతుండాలేం....ఒసేయ్ పెద్దరాక్షసీ, మీనాన్నని పిల్చుకురావే....బాబాయి వచ్చాడని చెప్పు. తలకాయ అడ్డంగా తిప్పుతావేమే తిక్కముండా, నీకుగాదూ చెబుతూంట నాన్నని పిలవమని. ఇదయ్యా బాబూ వరసా. దానికెంత సేపూ ఫ్రిజ్‌లోపెట్టిన క్రీములు పెడుతూంటే మాట వింటుంది... అంతా అడుగో మహానుభావుడు ఆ నా య న గారి పోలికే. మనం చెప్పేదేమీలేదు. దానికెంతతోస్తే అంత... తెలివీ ఆయన తెలివే అనుకో .... అఖండమైన బుర్ర....ఆయన ఎదుటవాడు ఆవులిస్తే పేగులు లెక్కపెడతారు. ఈ బొద్దెకాయ ముండ ఆవులించకుండానే లెక్కపెడుతుంది. వేలెడంత లేదు!" మురిపెంగా కూతురి తల నిమురుతూ నవ్వింది. "అసలూ ఆయన వాళ్ళ ఫ్రెండు చిన్న కారు తీసుకొస్తాను వెళదాం అన్నారు. అంతా ప్రయాణమయ్యారూ ఆ డ్రైవరు ముండాకొడుక్కి జ్వరమని మంచ మెక్కాడట. ఇంకేం చేయాలి. ఇదుగో బస్సు ప్రయాణం, టెక్కెట్ల గోల."

కన్నార్పకుండా జాగ్రత్తగా ఆ స్త్రీ ముఖంలోకి పరిశీలనగా చూచాను—నా ఊహాల్లోని నా శరదేనా ఈ శారద అని!

మనిషిలోనే గాదు మార్పు, మాటల్లోగూడా!

"నేను వస్తాను!" ఇంకా ఎక్కువ సేపు ఆవిడగారి మాటలు వినలేనేమోననిపించింది.

"నీ యిష్టం. వుంటే సరే!"

"వుండనులే వెళతాను"—ఉంటే ఉండు అంటే ఎలా వుంటాననాలో నాకు అర్థం కాలేదు.

శారదను చూడటంతోటే కొండెక్కినంత సంబరపడ్డాను. ఆ సంబరం ఒక్క క్షణమే మరు క్షణంలోనే అగాధంలో వున్నాను.

ఈ డబ్బున్న వాళ్ళకున్న రోగమే ఇది. చస్తే ఇంక శారదను గురించి ఆలోచించ గూడదు. ఎవరి గొప్ప వాళ్ళకే. గరుకు కాగితం తీసుకొని ఆమె రూపాన్ని గుండెల మీద నుంచి చెరిపేయాలి అనిపిస్తోంది.

—నన్ను కాదని ఎవరికో ఇచ్చి పెళ్ళి చేస్తుంటే పెరట్లో నన్ను పట్టుకొని ఏడ్చిన శారదేనా ఈ మనిషి అనిపిస్తోంది!

"సరే నీ యిష్టం!" ఆమె మాటలు చల్లని ఈదురు గాలిలో కొట్టుకు పోతున్నట్లనిపించగా సర్వం పోగొట్టుకున్న వాడిలా రోడ్డుమీదకు వచ్చేశాను.

వెనగ్గా రామం తల్లి!

రిక్షాలు మాట్లాడాను కృష్ణ లంకకి.

ఈ క్షణాన నాకు కృష్ణలంక నేనూహించుకున్నట్లుగా స్వర్గధామం కాదు-నరకతుల్యమే!


ఎప్పుడు విజయవాడ వదిలి తిరిగి హైద్రాబాద్ వెళ్ళిపోదామా అని మనస్సు తహతహలాడుతోంది.

శారద ఎంతగా మారిపోయింది?

రామం తల్లిని - అతగాడి రోగిష్టి అన్న దగ్గర వదిలివేస్తే నేను నెత్తిన పెట్టుకున్న బాధ్యత తీరిపోతుంది.

ఇక తిరుగు ప్రయాణమే తరువాయి.

గుంటలు, మెట్లల్లో ఎత్తెత్తి పడేస్తూ కాలువ మీదగా బ్రిడ్జిదాటి లోయలోకి జారి కంకర




రోడ్లు వెంట పరుగెత్తి చీకటి సందుల్లో దొర్లి ఓ వీధిమలుపు ముందు రిక్షా వెనుకగా నా రిక్షా ఆగింది.

రిక్షా ఎందుకు ఆగిందా అని ముందుకు చూస్తే ముందు రిక్షాలోవున్న ముసలమ్మ ఒక్కసారిగా ఆకాశం విరిగి మీదపడుతున్నట్లుగా 'ఘొల్లు' మన్నది.

నేను ఉలిక్కిపడి రిక్షాలోనుండి క్రిందకు దూకాను.

రిక్షా ఆగిన ఇంటి ముందు వరండాలో ఆ తెల్లవారుఝాము చీకటిలో ఓ మనిషి ఆకారం తెల్లటి గుడ్డలు చుట్టబడి పడుకోబెట్టి వున్నది. తల పక్కగా నూనె దీపం.

సర్వం అర్థమయింది.

ఆ వరండాలోనే శవాల్లా దిగులుగా కూర్చున్న మనుష్యులలో కదలిక .. ఏడ్పులు, ఆ యింట్లో అప్పుడే మరో శవం లేచిందన్నట్లుగా.

దూరాన కృష్ణమీదగా వీస్తున్న ఎండా కాలపు హోరు గాలి....

అంతా అయిపోయింది. రామం పెద్దన్నయ్య చచ్చిపోయాడు. కనీసం రామం తన పెద్దన్నయ్య కడసారి చూపులు గూడా చూచుకోలేకపోయాడు.

రిక్షా దిగి పక్కగా నిల్చున్న నన్ను పలకరించిన మనిషే లేడు. వింతగా ఒకళ్ళిద్దరు కళ్ళ చింపుకు చీకటిలో చూచినా ముఖాలు పక్కకు తిప్పుకు వెళ్ళిపోయారు.

అందరూ ఏడుపులు, ఏడుపులు, ఏడుపులు.

నాకు ఏం చేయాలో తెలియని అయోమయం.

రామం రాలేదు. రామం తల్లిని నేను తీసుకువచ్చాను. రామం వచ్చివుంటే చాలా బాగుండేది.

నేను సుడిగాలిలో గిరగిర తిరుగుతున్నట్లనిపించింది.

నా కర్తవ్యం? నేనేం చేయాలి ఇప్పుడు?

—అర్థంగాని అయోమయపు ప్రశ్న!

నాకు ఎవ్వరూ తెలియని ఆ ఇంట్లో నేను వుండి మాత్రం చేయగలిగిందేమున్నది.

నేను ఎవరికి చెప్పాలి! ఏమని చెప్పాలి?

వచ్చిన రిక్షాలోనే వెనుదిరిగాను. గుండెల్ని తెలియని బాధ అనే బరువుతో నింపుకొని

బస్సు స్టాండుకు ఎలావచ్చానో నాకే తెలియదు. చేతిలో బ్రీఫ్ కేసుతో రిక్షా దిగుతుంటే ఓ కుర్రవాడు అడిగాడు "హైద్రాబాద్ కా సార్!" అంటూ.

"అవును."

"టాక్సీ రెడీగా వున్నది సార్. యిరవై రూపాయలు!"

దేవుడు నాకోసరం నా యందు కనికరించి రెడీగా ఉంచిన వాహనం అది. దాన్ని కాదనే శక్తి నాకు లేదు!

—అప్పటికే పూర్తిగా మనుష్యులను గుడ్డల మూటల్లా కుక్కి వున్న ఆ టాక్సీలో దిక్కుతోచని వాడిలా ఇరుక్కు కూర్చున్నాను!

* * *

హైద్రాబాద్‌లో నేలమీద నేను కాలుపెట్టే టప్పటికి సరిగ్గా పదకొండు గంటలయింది.

వొళ్ళంతా ఎవరో చితక బాదినట్లుంటే ఇక సిటీ బస్సుకోసరం ఎదురుచూస్తూ కూర్చోలేక ఎదురుగ్గావున్న ఆటోలోకి దూకి చలపతి ఇంటి దగ్గరకు వెళ్లి ముందుగా రామం ఇంటి వాకిలి తలుపుమీద భయం భయంగా కొట్టాను.

ఆయనకు ఇంత ఘోరాన్ని ఎలా చెప్పాలి?

రామం ఇంట్లోవున్నాడో ఆఫీసుకువెళ్ళడో?

—నిన్ననే క్యాంపునించి వచ్చాడు కాబట్టి బహుశా రెస్టు తీసుకుంటూ ఇంట్లోనే వుండ వచ్చు! చూద్దాం.

నా అదృష్టం రామమే తలుపు తీశాడు!

అతడిని చూస్తూంటే నాకు ఆయాస మొస్తోంది. గుండెల్లో దడ, గొంతులో తడబాటు. నోరు పెగలటమేలేదు.

నంగి నంగిగా "ఐయామ్‌సారీ. చాలా చెడు వార్త మోసుకొచ్చాను. మీ అన్నయ్యగారు పోయారు" అన్నాను-ఒక్కసారిగా గటుక్కున —ఇంకా ఆగలేనట్లుగా.

రామం ఈ వార్తను భరించలేక కుప్పలా కూలిపోతే పట్టుకోవటానికే నన్నట్లుగా ముందుకు వంగాను.

రామం వెనుదిరిగాడు. "రండి లోపలికి!"

లోపలికి అడుగులు వేశాను.... తడబడే కాళ్ళతో!

"కూర్చోండి!"

వింతగా అతడి వంకే చూస్తూ కూర్చున్నాను.

"నన్ను క్షమించాలి మీకు శ్రమయిచ్చి నందుకు. మా అన్నయ్య పోయాడనే విషయాన్ని నిన్న టెలిగ్రామే చెప్పింది. కానీ ఏం చేయమంటారు చెప్పండి. నేను వెళ్ళలేక పోయాను. అలా వెళ్ళలేకపోయినందుకు దుఃఖంతోనూ, బాధతోనూ, సిగ్గుతోనూ చచ్చి పోతున్నాను. నేను వెళ్ళి ఏం చేయగలను. ఏం చేయాలి. ఏం చేయాలన్నా ముందు డబ్బు కావాలండీ. ఆయన ఇల్లు.... ఆయన ఇల్లు.... మీకు ఎలా చెప్పాలో నాకు తెలియటం లేదు. నా స్థితి మీకు తెలుసు.

"నా ఆర్థిక స్థితి ఎంత హీనంగావున్నదో మీ కంటే చలపతికి బాగా తెలుసు. చచ్చిన ఆయన్ను నేను ఎలాగూ బ్రతికించుకోలేను. బ్రతికివున్న నన్నుకూడా ఇప్పుడు వెళ్లి ఆ ఊబిలో కూరుకు పొమ్మంటారా. ఇంట్లో ఎప్పుడూ ఓ పైసాకూడా వుండని ఆ యింటి నుంచి ఆ శవాన్ని బయటకు తీయాలీ అంటే నేనంటూ వెళితే ఇక ఆ బాధ్యతంతా నాదే మాష్టారూ. నేను అందుకోసరమే అక్కడకు వెళ్ళాలి. అక్కడి వాళ్ళు నా రాకకు ఎదురు చూచేది గూడా అందుకే. ఇదీ నా స్థితి. మీకు తెలుసో తెలియదో నాలుగు రూపాయలు కావాల్సి, తాకట్టు పెట్టాలన్నా వీలులేకుండా నా భార్య మెళ్ళో ఒట్టి పసుపు కొమ్ములే వున్నాయి మాష్టారూ. నిజం మాష్టారూ! ఇది పచ్చి నిజం. అందుకే. .అందుకే బ్రతికి వుండీ కళ్ళు మూసుకొని చచ్చిపోయానూ అను కున్నాను. అలా అనుకోవటంవలన అక్కడైనా మీలాంటి నలుగురూ జేరి నాలుగు చేతులూ వేసి...."

—ఇక నేను అక్కడ వుండలేక బయటకు పారిపోయి వచ్చేశాను! □